క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



భేటీ అయిన ఏయూ, నన్నయ్య వర్సిటీ వీసీలు రాజశేఖర్, ప్రసన్నశ్రీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన వీసీ ఆచార్య జీ.పి.రాజశేఖర్‌ను ఆయన కార్యాలయంలో గురువారం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఆంధ్రా యూనివర్సిటీని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రసన్నశ్రీని ఈసీ రాజశేఖర్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కృష్ణా కళాశాల విద్యార్థుల అధ్యయన యాత్ర



లా యూనివర్సిటీ వీసీ సూర్యప్రకాష్‌తో కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు పి.ధనలక్ష్మి, డి.వి.ఎల్.తేజస్వి ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీలో క్షేత్ర అధ్యయనం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. దీనిలో భాగంగా న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విశ్వచంద్రనాథ్‌లు ఉన్నత చదువులు అభ్యసించాలని విద్యార్థులకు సూచించారన్నారు. విద్యార్థులు లైబ్రరీ, ఇతర విభాగాలను సందర్శించారని చెప్పారు. కార్యక్రమానికి లైబ్రేరియన్ డాక్టర్ రాజేష్, డాక్టర్ లీలామోహన్ పూర్తి సహకారం అందించారన్నారు.

కాకుల మృత్యువాత..!



ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రి ఆవరణలో మృతి చెందిన కాకులు



ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని పార్కులు, ఆస్పత్రుల పరిసరాల్లో కాకులు మృత్యువాతపడుతున్నాయి. ఏవిధంగా అవి మరణిస్తున్నాయో తెలియక స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ) ఆవరణలో రెండు రోజుల కిందట నాలుగు కాకులు మృతిచెందాయి. ఇవి ఎలా చనిపోయాయోనని స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ముడసర్లోవ పార్కులో సుమారు 20 కాకులు, నాలుగు కొంగలు మరణించిన విషయం తెలిసిందే. వాటి మృతిపై పశు సంవర్ధక శాఖ అధికారులు వైద్య పరీక్షలు కూడా జరిపారు. కారణాలు తెలియరాలేదు. ఫారం కోళ్లకు వచ్చిన విధంగా బర్డ్ ఫ్లూ లాంటి వ్యాధి ఏమైనా కాకులు కూడా సోకిందా అనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. వెటర్నరీ అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో తనిఖీలు



రైతుబజార్‌లో కాటాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రామారావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో గురువారం జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డ్వాక్రా స్టాళ్లతోపాటు వాణిజ్య సంబంధిత స్టాళ్లు, నిత్యావసర సరకుల షాపుల్లో కాటాలను పరిశీలించారు. కాటాల స్టాంపింగ్ తనిఖీ చేయడంతోపాటు తూకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని చూశారు. రైతులంతా తప్పనిసరిగా తూనికల విషయంలో నిబద్ధతగా వ్యవహరించాలని సూచించారు. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది ప్రసాద్, రమణ, రైతుబజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు కనకరాజు పాల్గొన్నారు.

అంతస్తులపై అంతస్తులు.. కాసులే కాసులు



ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు లేకున్నా.. యథేచ్ఛగా కొత్త భవనాల ప్రారంభం

అడ్డుకట్ట వేయని జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారులు

బిల్డర్లు, కూటమి నాయకులతో కుమ్మక్కు • రూ.లక్షల్లో జీవీఎంసీ ఆదాయానికి గండి



సెక్టార్-9 ప్రధాన రహదారిలో భవనానికి రంగులు వేసి ప్రారంభించిన అనంతరం పైన నిర్మిస్తున్న అదనపు అంతస్తు

ఎంవీపీకాలనీ: నివాసయోగ్యత అనుమతులు (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్-ఓసీ) జీవీఎంసీ జోన్-3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. జోన్-3 ఏసీపీ నుంచి వార్డు ప్లానింగ్ సెక్రటరీల వరకు అందరూ చేతివాటం చూపేందుకు మార్గం చూపుతున్నాయి. కొత్తగా భవనం నిర్మించిన ఏ యజమాని అయినా నిబంధనల ప్రకారం నిర్మాణం పూర్తయిన అనంతరం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. జీవీఎంసీ నిబంధనలతోపాటు అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం అన్ని రకాల నిర్మాణ పనులు పూర్తయ్యాక మాత్రమే టౌన్‌ప్లానింగ్ విభాగం ఓసీలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ పొందకుండా కొత్త భవనాలను ప్రారంభించడం కాని, వినియోగించడం కాని నిబంధనలకు విరుద్ధం. అలాంటి భవనాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జోన్-3 పరిధిలో వందల భవనాలు ఓసీలు లేకుండానే ప్రారంభం కావడం పరిపాటిగా మారింది.

ప్లాన్ చూపించి.. ప్రారంభోత్సవాలు

గతేడాదిగా జోన్-3 పరిధిలో వందల సంఖ్యలో భవనాలు నిర్మాణం కాగా.. వాటిలో 10 శాతం భవనాలకు కూడా ఓసీలు మంజూరు కాలేదని సమాచారం. కేవలం ప్లాన్ చూపించి, టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపించి ఆయా బిల్డర్లు, యజమానులు ప్రారంభోత్సవాలు చేసుకోవడంతోపాటు కమర్షియల్ కార్యకలాపాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. జోన్-3 టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటం, అనధికారిక వసూళ్ల కారణంగానే ఆయా భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభవుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెరవెనుక ఒప్పందాలు

◆ ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో ఓ బిల్డర్ బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. ప్లాన్ ప్రకారం నిర్మించకపోగా.. అదనపు అంతస్తు కట్టాడు. నిర్మాణం పూర్తయి రెండు నెలలైనా నేటికీ ఆ భవనానికి ఓసీ మంజూరు కాలేదు. ఈ నిర్మాణం విషయంలో కూటమి నేత ఒకరు బిల్డర్ నుంచి రూ.లక్షలు దండుకోవడంతోపాటు టౌన్ ప్లానింగ్ అధికారులకు సైతం వాటాలు పంచినట్లు సమాచారం.

◆ ఇదే సెక్టార్‌లో గతంలో జీవీఎంసీ రోడ్డు ఉన్న చోటు ఆక్రమించి మరీ ఓ బహుళ అంతస్తు భవనం నిర్మించారు. దీని సెల్లార్‌లో ఇంకా పని జరుగుతుండగానే పైఅంతస్తులను విక్రయించి కార్యకలాపాలు ప్రారంభించారు.

◆ సెక్టార్-9లోని అప్పుఘర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఓ భవన నిర్మాణం జరిగింది. దానికి రంగులు సైతం వేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవనంపై అనధికారికంగా మరో అదనపు అంతస్తు నిర్మిస్తున్నా.. టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు.

◆ లాసన్స్ బే కాలనీ టీకు పార్కు ఎదుట సెట్ బ్యాక్ కూడా లేకుండా భవన నిర్మాణం జరిగింది. కనీసం 20 అడుగుల రహదారి కూడా లేని మార్గంలో నాలుగంతస్తుల భవనం నిర్మించారు. నేటికీ ఆ భవనానికి ఓసీ మంజూరు కానప్పటికీ యజమాని నుంచి ముడుపులు తీసుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలు, ప్రారంభాలపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

స్పందించని అధికారులు

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరుపై జోన్-3 టౌన్‌ప్లానింగ్ టీపీవో, టీపీఎస్‌ల వివరణ 'సాక్షి' కోరగా.. ఆ సమాచారం తమ వద్ద లేదంటూ మాట దాటవేశారు. ఇదే విషయమై జీవీఎంసీ జోన్-3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావు వివరణ కోరేందుకు పలు మార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



లాసన్స్ బే కాలనీలోని 15 అడుగుల రోడ్డులో నిర్మించిన బహుళ అంతస్తుల భవనం



ఎంవీపీ సెక్టార్-5లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనం



సెక్టార్-5లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా ప్రారంభమైన బహుళ అంతస్తుల భవనం

వందల భవనాలకు ఓసీలు నిల్

జోన్-3 పరిధిలో గతేడాది కాలంగా వందల సంఖ్యలో కొత్త భవనాలు నిర్మించారు. ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో ఇలాంటి భవనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. పూర్తిస్థాయిలో పనులు పూర్తికాకుండానే ఆయా భవనాల్లో కమర్షియల్, ఇతరత్రా కార్యకలాపాలు ప్రారంభమైపోతున్నాయి. పైఅంతస్తుల్లో పనులు జరుగుతుండగానే చాలా చోట్ల కింది అంతస్తుల్లో యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో సైతం ఆయా నిర్మాణాల యజమానులు, బిల్డర్లు నిబంధనల ప్రకారం పనులు పూర్తిచేయకుండానే ప్రారంభాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిపై సమాచారాన్ని నిత్యం వార్డు ప్లానింగ్ కార్యదర్శులు జోన్-3 టీపీవో, టీపీఎస్, ఏసీపీ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా అలాంటి భవన నిర్మాణదారులు, బిల్డర్లతో టౌన్‌ప్లానింగ్ అధికారులు తెరవెనుక ఒప్పందాలు చేసుకుంటూ రూ.లక్షలు దండుకుంటున్నారు. అనంతరం వాటిపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో కూటమి నాయకులు సైతం బిల్డర్ల నుంచి రూ.లక్షలు దండుకుంటూ భాగస్వాములవుతున్నారు. దీంతో ఇటువంటి నిర్మాణాలు టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తుండగా.. జీవీఎంసీకి ఆదాయానికి మాత్రం గండికొడుతున్నాయి.

కేంద్రాల సందర్శన.. పనితీరు పరిశీలన



ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఇంజినీరింగ్ కళాశాలలోని ఆ-హబ్‌ను గురువారం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సందర్శించారు. స్టార్టప్ సంస్థల పనితీరు, ప్రగతి తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు స్టార్టప్ సంస్థల ప్రగతి, నూతనంగా సంస్థల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలు, అనుమతులు, ఆ-హబ్ సాధించిన మైలురాళ్లు తదితర అంశాలను వివరించారు. నాస్కామ్ సౌజన్యంతో ఏయూలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను వీసీ పరిశీలించి అక్కడ పనిచేస్తున్న స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఏయూలో నిర్మిస్తున్న ఎస్‌టీపీఐ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఏయూలో గతంలో ఏర్పాటైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, అక్కడున్న ఉపకరణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీ4 ఐ4 లేబరేటరీపై వీసీ రివ్యూ చేశారు. నాలుగు వారాల్లో పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని సూచించారు. ఎలిమెంట్ భవనాన్ని పరిశీలించారు. దీనిలో ఇప్పటికే ఫుడ్ బయో సైన్స్ లేబరేటరీకి వచ్చిన పరికరాలను, లేబరేటరీలో ఇన్‌స్టాల్ చేయాలన్నారు. ఏప్రిల్ నెలాఖరికి వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. పెందుర్తి దరి సుజాతనగర్‌కు చెందిన ఎం.సత్యనారాయణ నగరంలోని ఓ సంస్థలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఏదో పని మీద నగరం నుంచి హనుమంతవాక వైపు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వెంకోజీపాలెం సమీపంలో ఓ వ్యక్తి అతడిని లిఫ్ట్ అడగడంతో బైక్ ఎక్కించాడు. హనుమంతవాక వద్ద యూటర్న్ చేస్తుండగా అదే సమయంలో మధురవాడ వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న ఓ లారీ ఆ బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న సత్యనారాయణ కాలు విరిగింది. లిఫ్ట్ అడిగి బైక్ వెనుక కూర్చొన్న వ్యక్తి తలకు తీవ్ర గాయమై అక్కడే ప్రాణాలు విడిచాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆరిలోవ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



భానోజీనగర్ గెడ్డలో వ్యర్థాలు

- 28వ వార్డులో పేరుకుపోయిన చెత్త
- కానరాని పారిశుధ్య కార్మికులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

బీచ్‌రోడ్డు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రేటర్ విశాఖను పారిశుధ్య సమస్య వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ దుస్థితి ఏర్పడింది. అధికారులు సక్రమంగా విధులు నిర్వహించక పోవడంతో పారిశుధ్య సమస్యలు అధికమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, తరలించేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో చెత్త సేకరణ, గెడ్డలు, కాలువల శుభ్రతను గాలికొదిలేశారు. దీంతో జీవీఎంసీ వార్డుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. కాలువలు, గెడ్డలు కంపుకొడుతున్నాయి.

పర్యవేక్షణ కరువు..

జీవీఎంసీ 28వ వార్డు చెత్తమయంగా తయారైంది. పలు ప్రాంతాలు చెత్తతో నిండాయి. రోడ్లు, గెడ్డలు, కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు, దారిన పోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలు, కాలువల్లో వ్యర్థాలు, మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్గంధం వెలువడుతోంది. చెత్త తరలింపులో జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారి పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. వార్డులోని పీతానిదిబ్బ, భానోజీనగర్ తదితర ప్రాంతాల్లో చెత్త తరలింపు, గెడ్డల శుభ్రతకు గడిచిన ఐదు రోజులుగా పారిశుధ్య కార్మికులు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనితో ఇళ్లు, రోడ్ల మీద, గెడ్డల్లో చెత్త పేరుకుపోయింది. ఒకవైపు దుర్వాసన.. మరోవైపు దోమల బెడదతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డుకు మోక్షం



చలపతినగర్‌లో నిర్మించిన బీటీ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు చలపతినగర్‌లో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం జరిగింది. ఇక్కడ సీతకొండ వాలులో అటవీ శాఖ అధికారుల క్వార్టర్స్, మరో పక్క స్థానికులు వినియోగించే రహదారి శిథిలమైంది. దీనిపై రాళ్లు తేలిపోవడంతో స్థానికులకు సమస్యగా మారింది. దీనిపై జీవీఎంసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ సమస్యపై నెల రోజుల కిందట 'సాక్షి'లో ప్రచురితమైన 'శిథిలమైన రహదారులు' కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఇక్కడ ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. రెండు రోజుల కిందట ఇది పూర్తయింది. శిథిల రహదారి సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల హక్కులకు మద్దతు పలకండి




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు తదితరులు

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల హక్కులకు మద్దతు పలకండి నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలన్నారు. మహిళల్లో చైతన్యం నింపడంతోపాటు హక్కులపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అప్పారావు, మహాలక్ష్మి, దీపిక, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గొడుగు' అసోసియేషన్ వార్షికోత్సవం

ఎంవీపీకాలనీ: శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ అసోసియేషన్ 3వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్క్ ఆవరణలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా ఉండటానికి నడక ఎంతో అవసరమన్నారు. నడక ద్వారా శారీరక శ్రమతోపాటు మానసిక ఆనందం కలుగుతుందన్నారు. బిజీ లైఫ్‌లో ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ సమయం చూసుకుని ప్రతి రోజు నడకకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభావతిని గొడుగు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.శివరామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధభరితం



విమ్స్ గేటు వద్ద గెడ్డలో పేరుకుపోయిన చెత్త



గెడ్డలో నిల్వ ఉన్న మురుగు నీరు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) వద్ద నూతన పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి నిర్మాణం కోసం జరుగుతున్న పనులు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో విమ్స్ గేటు వద్ద గెడ్డలో చెత్త పేరుకుపోయి, మురుగు నీరు నిల్వ ఉండిపోయింది. విమ్స్ స్థలంలోనే ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన ఆరిలోవ పోలీస్ స్టేషన్ నిర్మించిన విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేకంగా రహదారి లేదు. దీంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన బీఆర్‌టీఎస్ నుంచి దీనికి రోడ్డు నిర్మిస్తున్నారు. దీని కోసం గెడ్డపై వంతెన కడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా గెడ్డ నుంచి నీరు కిందకు రాకుండా మూసేశారు. చిన్న కాలువలా తవ్వి పనులకు ఆటంకం కలగకుండా ఆ నీటిని పక్కనుంచి పంపిస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. చిన్న కాలువలాంటి మార్గం కావడంతో నీరు కిందకు ప్రవహించడం లేదు. ఆరిలోవ కాలనీ, పెదగదిలి, చినగదిలి, తోటగరువు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల నుంచి స్థానికుల వాడుక నీరు ఈ గెడ్డ నుంచి కిందకు ప్రవహిస్తుంది. ఆ నీటిలో చెత్త కూడా కిందకు వెళ్లే మార్గం ఇక్కడ మూసుకుపోయింది. విమ్స్ గేటు వరకు మురుగు నీటితోపాటు చెత్త పేరుకుపోయింది. దీని నుంచి వస్తున్న దుర్గంధంతో విమ్స్‌కు వెళ్తున్న రోగులు, వారి బంధువులు, విమ్స్ సిబ్బంది ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రహదారి పనులు చేపడుతున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఈ గెడ్డలో పేరుకుపోయిన చెత్త, మురుగు నీటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని రోగులు, సిబ్బంది కోరుతున్నారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన అవసరం



మత్స్యకారులకు పరికరాలు పంపిణీ చేస్తున్న విజయకృష్ణ

మహారాణిపేట: ఫిషింగ్ నౌకల్లో ఉపయోగించే వివిధ అగ్నిమాపక పరికరాలపై అవగాహన ఉండాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ అన్నారు. గురువారం పెదజాలారిపేటలోని కమ్యూనిటీ హాల్లో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ) యూనిట్, మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన సముద్రంలో జీవిత భద్రత అనే అంశంపై ప్రసంగించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మాట్లాడుతూ సముద్రంలో వేట సమయంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే బయటపడే వివిధ పరికరాలు ఉన్నాయన్నారు. వాటిపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ శాఖలకు చెందిన వెంకటేశ్వర్లు, అభిషేక్, దీపక్, సుశాంత్ తదితరులు వివిధ అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమానికి 50 మంది మత్స్యకారులు హాజరయ్యారు. వారికి పలు పరికరాలను ఏడీ విజయకృష్ణ పంపిణీ చేశారు.

ఎఫ్‌సీఐలో సాయుధ దళాలకు ముగిసిన శిక్షణ



సాయుధ దళాల సిబ్బందికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో భారత సాయుధ దళాలకు చెందిన ప్రీ రిటైర్మెంట్ కోర్సు విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. డిప్లమో ఇన్ టూరిజం అండ్ హాస్పిటాలటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 24 వారాల పాటు ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. నగరంలో ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం అడ్మిన్ కల్నల్ అమితాబ్ కుమార్ ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథులుగా ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏపీ రామకృష్ణ, డిఫెన్స్ జాయింట్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం విద్యా సలహాదారు డాక్టర్ ఉజ్వల కుమార్ ఘటక్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కోర్సుకు సంబంధించిన ఉపయోగాలు, నైపుణ్యం గురించి ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ వివరించారు. పర్యాటక కార్యకలాపాలు, ఆతిథ్య నిర్వహణ, కస్టమర్ సేవలు, ఈవెంట్ ప్లానింగ్ తదితరవాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు పార్థసారథి, కుముదిని, లీలాప్రియదర్శిని, జాషువా, సిబ్బంది పాల్గొన్నారు.